

ఆయిల్‌పామ్ పంటపై అవగాహన కల్పిస్తున్న నర్సింహారావు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

» డీఏవో నర్సింహారావు

తలకొండపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్‌లు అన్నారు. తలకొండపల్లి రైతు వేదికలో మంగళవారం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మొక్కలకు 90శాతం సబ్సిడీ, డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీలకు 100శాతం, బీసీలకు 80శాతం, నాలుగేళ్ల వరకు నిర్వహణకు ఎకరాకు రూ.4,200 అందిస్తుందని చెప్పారు. నాలుగు సంవత్సరాల నుండి పంట దిగుబడి మొదలై 35 సంవత్సరాల వరకు వస్తుందని వివరించారు. ఈ పంటకు చీడపీడల బాధ తక్కువేనని, అధిక వర్షాలకు కూడా తట్టుకుంటుందని తెలిపారు. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అదికారి సౌమ్య, ఏడీఏ ఆదిలక్ష్మి, వాల్యు ఆయిల్ కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు, జిల్లా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఏవో రేణుకా చక్రవర్తి, రుక్మిణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





పుష్ప విలాసం

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ప్రధాన రోడ్డులో రంగు రంగుల పూలు వాహనదారులను అలరిస్తున్నాయి. ప్రధాన రహదారి వెంట జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు వివిధ రకాల పూల మొక్కలు నాటారు. అవి ఇప్పుడు పూలు పూశాయి. ప్రస్తుతం మంచు కురుస్తుండడంతో అవి నిగనిగలాడుతూ కనువిందు చేస్తున్నాయి. విమాన ప్రయాణికులు ఈ పూల సోయగాన్ని చూసి ఆహ్లాదం పొందుతున్నారు.

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి)

ఏకసభ్య కమిషన్‌కు వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ మంగళవారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దళిత సంఘాల నాయకులు వినతి పత్రాలను అందజేశారు. మాలలు, మాదిగలు, జంగాలు, చిందులు, బేడ బుడగ జంగాలు, బైండ్ల మంగులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు డాక్టర్ అక్తర్‌కు వినతులను అందజేశారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వర్గాల సామాజిక-ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య మరియు ఉద్యోగాలకు రిజర్వేషన్లు పొందడంలో ఎదుర్కొంటున్న అన్యాయాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమన్నారు. న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా సోషల్ వెల్ఫేర్‌అధికారి రామరావ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏకసభ్య కమిషన్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన అక్కడి వారితో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

పోచారంలో పర్యటన

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డా.షమీమ్ అక్తర్ మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం పోచారంలో పర్యటించారు. ఎస్సీ కాలనీలో తిరిగి వారి జీవన విధానం, స్థితిగతులు తెలుసుకున్నారు. మహిళలు, యువకులను కలిసి విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఆరోగ్య పరిస్థితులెలా ఉన్నాయని అడిగారు. ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలను కాలనీ వాసులు ఆయనకు వివరించారు. వర్గీకరణ విషయమై మాజీ ఎంపీపీ కృపేష్ తదితరులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

మొలకెత్తిన ధాన్యం.. ఆందోళనలో రైతులు 6

వానకు తడిసి పాడైన వడ్లు

ప్రభుత్వం వాటిని కొనాలని వేడుకోలు



కొలువులేవీ..?

పారిశ్రామిక ప్రాంత స్థానికులకు ఉద్యోగాలు కరువు

- ఇతర ప్రాంతాల వారికే పెద్దపీట
- స్థానికులకు ఉద్యోగ కల్పనకు జీవో తెస్తామన్న బీఆర్ఎస్ ప్రభుత్వం
- నేటికీ అమలుకు నోచుకోని వైనం
- కాలుష్యపు కాటుకు బలవుతున్న ప్రజలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా చర్యలు తీసుకుంటుందా అన్న సందేహాలు





తమ ప్రాంతానికి పరిశ్రమలు వస్తే ఇక్కడి యువతకు ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తాం. ప్రభుత్వాలు కూడా అదే చెబుతుంటాయి. ఉద్యోగాలు, ఉపాధి దొరకుతుందన్న పేరుతో ఆ ప్రాంతాల్లో కాలుష్య కారక పరిశ్రమలు నెలకొల్పినా స్థానికుల నుంచి పెద్దగా వ్యతిరేకత రావడం లేదు. పైగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రైతుల భూములను కూడా తీసుకుంటుంది. ఇదంతా తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.. తమకు ఉపాధి దొరుకుతుందన్న ఆశతో చేస్తున్నారు. అయితే, పరిశ్రమలు నెలకొల్పి వాటి కాలుష్యపు కాటుకు ప్రజల ఆరోగ్యం, పంటలు దెబ్బతింటున్నాయి తప్ప స్థానికులకు ఉద్యోగాలు మాత్రం ఇవ్వడం లేదు.

షాద్‌నగర్, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్ నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ పరిశ్రమలు కలిపి 300పై చిలుకు ఉన్నాయి. వీటిల్లో సుమారు 35వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 90శాతం మేర వలస వచ్చిన కార్మికులే. పరిశ్రమల యాజమాన్యాలు తమ లాభాపేక్షతో అమల్లో ఉన్న కార్మిక చట్టాలు, నియమ నిబంధనలను పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ నెలకొన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులు నారాజ్ అవుతున్నారు. దీంతో బయటి ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తుంటే.. ఇక్కడి వారు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు.

1975లో పారిశ్రామిక ప్రాంతం ఏర్పాటు

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు, నందిగామ మండలాల మధ్య 1975లో పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ప్రత్యేక రాయితీలు కల్పించడంతో కొత్తూరు, నందిగామ మండలాల

మిగతా 8వ పేజీలో...

వలస కార్మికులే ఎందుకంటే..

ఇక్కడి పరిశ్రమల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులతో రోజుకు 12 గంటలు పని చేయించుకుంటున్నారు. అన్‌స్కిల్డ్ కార్మికులతో స్కిల్డ్ పనులు కూడా చేయిస్తున్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా బయటి ప్రాంతాల వారు పరిశ్రమల యజమానులను గట్టిగా నిలదీయరన్న ధీమా ఉంది. స్థానికులైతే ఈ పరిస్థితి ఉండదని వలస కార్మికులనే పరిశ్రమల్లో నియమించుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. వాస్తవానికి పరిశ్రమల్లో అంతర్ రాష్ట్ర కార్మికులుంటే 1979 నిబంధనల ప్రకారం వారి వివరాలను ప్రభుత్వానికి తెలపాలి. వారికి ప్రత్యేక భద్రత, వసతులు, కనీస వేతనాలు అమలు చేయాలి. కానీ, ఇక్కడ ఇవేమీ అమలు కావడం లేదు.

చట్టం తేవాలి



పరిశ్రమల్లో స్థానికులకే 75శాతం ఉద్యోగాలు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ స్థానికులకు ఉపాధి లేకుండా పరిశ్రమల యజమానులు చేస్తున్నారు. వలస కార్మికులకు కనీస వేతనం, భద్రత పరికరాలు అందజేయాలి. పరిశ్రమల్లో ప్రమాదాల వల్ల మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి. కాలుష్యాన్ని అరికట్టేందుకు పీసీబీ అధికారులు ప్రతి ఆరునెలలకోసారి పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలి.

- లక్ష్మీనర్సయ్య, నిరుద్యోగి, కొందుర్గు

15నుంచి ప్లాట్ల పంపిణీ!

ఫార్మాసిటీ భూ బాధితులకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఏర్పాట్లు

- ఫార్మాసిటీకి భూమి ఇచ్చిన ప్రతీ రైతుకు ప్లాట్
- లాటరీ పద్ధతిన కేటాయింపు
- ఇటీవల వెంచర్‌ను పరిశీలించిన కలెక్టర్, ఆర్డీవో



వెంచర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

యాచారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ ప్లాట్లు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 15 నుంచి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ప్లాట్లు కేటాయించనున్న వెంచర్‌ను ఇటీవల కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిలు పరిశీలించారు. ఫార్మాసిటీకి ఎకరం భూమి ఇచ్చిన వారికి 121గజాలు, రెండెకరాలు ఇచ్చిన వారికి 242 గజాలు, ఇలా.. ఎకరానికి 121గజాల చొప్పున ఎంత భూమి ఇస్తే అన్ని గజాల ప్లాటు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. రైతులకు లాటరీ పద్ధతిన వీటిని కేటాయించనున్నారు.

పాత సర్టిఫికెట్ల పరిస్థితేంటి?

బీఆర్ఎస్ పాలనలో కొందరు బాధిత రైతులకు ఇంటి పట్టా సర్టిఫికెట్లనందించారు. అవే సర్టిఫికెట్ల ఆధారంగా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పలువురు రైతులు ప్లాట్లను విక్రయించి వారి సర్టిఫికెట్లను ప్లాటు కొన్న వారికి అందించారు. లాటరీ తీసిన రోజున మేం వచ్చి సర్టిఫికెట్‌పై ప్లాట్ నెంబర్ వేయించి ఇస్తామని గతంలో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే, ఇప్పుడు పాత సర్టిఫికెట్లకు బదులుగా మళ్లీ కొత్తగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంతో కూడిన పట్టా సర్టిఫికెట్లు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పాత పట్టా సర్టిఫికెట్ల సంగతేంటన్న చర్చ జోరుగా సాగుతోంది.

వెంచర్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రం

వెంచర్‌లో అత్యంత అధునాతన వసతులతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రం ఏర్పాటుకు భవనం నిర్మిస్తున్నారు. యువకులకు ఇందులో కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఈ భవనం నిర్మిస్తున్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం

ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తాం. రైతుల ఇంటి స్థలం కోసం పట్టా సర్టిఫికెట్లనందించి ఆదుకుంటాం. బలవంతంగా భూములు తీసుకునేది లేదు. ల్యాండ్‌పూలింగ్ విధానంతో భూ సేకరణ చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెంచర్‌లో అన్ని రకాల వసతులు కల్పిస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

అనంతరెడ్డి, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం



కూరగాయలు @బాబాగూడ

- పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
- తీగజాతి కూరగాయలతో పాటు ఇతర పంటల సాగు
- డిగ్రీ చదివి కూరగాయల సాగులోకి యువత

7



రక్షణ లేక ప్రమాదకరంగా..

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు
- నివాసాలకు దగ్గరగా ఏర్పాటు

8



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలీస్, నోడల్ అధికారులు, ఇతర శాఖ అధికారులతో గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్షకు ఆలస్యంగా వస్తే అనుమతించేది లేదన్నారు. పోలీస్, నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 90 పరీక్షా కేంద్రాల్లో 56,883 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, నోడల్ అధికారులు చేయాల్సిన పనులపై అదనపు కలెక్టర్ వివరించారు. పరీక్ష కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని సంబంధితసెంటర్ నిర్వాహకులకు సూచించారు. పరీక్షలు జరిగే సమయాల్లో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులను నడిపించాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్లు, రూట్ ఆఫీసర్లు, ఇతర నోడల్ అధికారులు, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయాలు సరికాదు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని రాజకీయం చేయడం తగదని తెలంగాణ రాష్ట్ర చిత్రకారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రూపం వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం అస్తిత్వం ఉట్టిపడేలా బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకర్తలు ప్రొఫెసర్ గంగాధర్, ఎంపీ రమణారెడ్డిలు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా ఉందన్నారు. ప్రతీ ఇంట్లో కన్నతల్లిని చూసిన భావన కలుగుతుందన్నారు. తెలంగాణ తల్లిని అగౌరవ పరచడం సరైంది కాదన్నారు. చిత్రకారుల సంఘం నాయకులు కళా లింగం, శ్రీనివాస్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ధరణి అప్లికేషన్లు, ల్యాండ్ అక్విజిషన్, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు నిరంతరం కృషిచేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కీసర ఆర్డీవో సైదులు, తహసీల్దార్ డీఎస్ రజినీ, డీటీ రాజేందర్, ఆర్ఐలు సాయిరామ్, కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొలకెత్తిన ధాన్యం.. ఆందోళనలో రైతులు

- వానకు తడిసి పాడైన వడ్లు
- ప్రభుత్వం కొనాలని వేడుకోలు

యాచారం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల క్రితం మోస్తరు వర్షం కురియడంతో ధాన్యం తడిసి మొలకెత్తింది. వానకాలం వడ్లను రైతులు రోడ్లపై ఎండబోసి రాత్రిపూట ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్నారు. అయితే, వానకు వడ్ల రాసుల కింద నీరుచేరి ధాన్యం తడిసి మొలకెత్తింది. మంగళవారం ఉదయం ఎండకు నేర్పుతున్న సమయంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూసి రైతులు ఖిన్నులయ్యారు. కొన్నిరోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో కుప్పలు నేర్పలేదని, వాటి కిందికి నీరు చేరి వడ్లు మొలకెత్తాయని నజ్దిక్‌సింగారానికి చెందిన రైతులు యాదమ్మ, మల్లేష్ కన్నీటి పర్యంతమయ్యారు. మొలకెత్తిన ధాన్యాన్ని పడేసేందుకు మనసు రావడం లేదని, మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులే కొని తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



రోడ్డు పక్కన మొలకెత్తిన వడ్లు

పోరాట యోధుడు పండుగ సాయన్న



తలకొండపల్లి : సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పరిగి : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

కొడంగల్‌రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెత్తందారీ వ్యవస్థపై రాజీలేని పోరాటం చేసిన యోధుడు పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య ముదిరాజ్ అన్నారు. పండుగ సాయన్న వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కూర వెంకటయ్య తలారి శేఖర్, కాశప్ప, రాములు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి: తెలంగాణ రాబిన్‌ఉడ్ పండుగల సాయన్న 134వ వర్ధంతిని మంగళవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. పరిగిలోని పండుగల సాయన్న విగ్రహానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలు, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ చైర్మన్లు ఆంజనేయులు, సురేందర్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాణిక్యం, సత్యనారాయణ, రాంచంద్రయ్య, నాగేశ్వర్, డి.కృష్ణ, బందెయ్య పాల్గొన్నారు.

తలకొండపల్లి : పండుగ సాయన్న ఆశయ సాధనకు ముదిరాజ్‌లు కృషి చేయాలని మత్స్యకారుల సంఘం మండలాధ్యక్షుడు బోళ్ల యాదగిరి ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలయ్యలు పిలుపునిచ్చారు. మండలం కేంద్రంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాయన్న వర్ధంతిని నిర్వహించారు. మత్స్యకారులు పెద్దసంఖ్యలో పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు పుట్ట పాండు, పద్మ అనిల్, బక్కి కుమార్, తదితరులున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాయన్న వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, నాయకులు డిగ్రీ కృష్ణ, ఆరిఫ్, చెన్నకేశవులు, రమేశ్, నూకం శేఖర్, రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కాలేజీ యాజమాన్యంతో మాట్లాడుతున్న రాథోడ్ సంతోష్

ఆల్‌ఫోర్స్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం తీరుపై ఆయన మంగళవారం కాలేజీ వద్ద ఆందోళన చేపట్టి కొద్దిసేపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుషాపూర్‌లోని ఆల్‌ఫోర్స్ ఇంటర్ కళాశాలలో విద్యార్థులు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. చదువుకునే పిల్లలు చిన్న చిన్న పొరపాట్లు చేస్తే తల్లిదండ్రులను పిలిచించి కౌన్సిలింగ్ ఇప్పించి సరిదిద్దాల్సిన అధ్యాపకులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఫీజుల విషయంలో ఉన్న శ్రద్ధ పిల్లలకు చదువు చెప్పడంలో లేదన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, శివ, కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలి



ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పులుమామిడి గ్రామంలో పల్లె దవాఖాన నూతన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీవో అనురాధ, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, భీమ్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు నర్సిములు, యాదగిరి, సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు కందాడ నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాస్, అమీర్ జానీ, గోపాల్‌రెడ్డి, వైద్యాధికారి రోహిత్ పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలు చేపట్టొద్దు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుట్కా వంటి పదార్థాల క్రయ విక్రయాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బి.ప్రమోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆమనగల్లులో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిని చేరదీసి విధిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే ప్రాణాలకే ముప్పు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. డ్రైవింగ్ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాలను తనిఖీ చేసి గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై మద్యం కేసులు, ఒకరిపై గుట్కా విక్రయం కేసు, బహిరంగంగా మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పత్రాలు లేని పది వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, కడ్తాల్ ఎస్సైలు వెంకటేష్, శ్రీకాంత్, నరహరి, వరప్రసాద్, రాజ్‌కుమార్ మరో నలుగురు ట్రైనీ ఎస్సైలు పాల్గొన్నారు.



కిరాణ షాపును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బీసీ సంఘాల నేతల ధర్నా



బీసీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

బీసీ సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ముట్టడి

తాండూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు తాండూరు పీపుల్స్ డిగ్రీ కాలేజ్ నుంచి బయలుదేరి శివాజీ చౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని నినాదాలు చేశారు. విడుదల చేయక పోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్, జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేశ్, మండలాల అధ్యక్షులు శ్రావణ్, బసంత్, నరేందర్, విద్యావంతుల వేదిక ప్రతినిధి పర్యాద రామకృష్ణ, బీసీ మహిళ సంఘం ప్రతినిధులు విజయలక్ష్మీ, మంజుల, అనిత, నర్సమ్మ, యువ నాయకులు రాము, గిరిజపూర్ రమేష్, మంతటి రాజు, తాండూరు నరేష్, శివకుమార్, పాల్గొన్నారు.

తాండూరు సీసీఐలో సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి విన్నపం

తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు సీసీఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరారు. ఈమేరకు మంగళవారం ఎంపీ కుమారస్వామిని ఢిల్లీలో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఎంపీ తెలిపారు. సీసీఐ కర్మాగారంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు గణనీయంగా పడిపోయిన ఉత్పత్తులను తిరిగి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాల కోసం తాండూరు ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సీసీఐని బలోపేతం చేయాలని కోరాగా.. సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

15న కులకచర్ల మండలంలో మంత్రుల పర్యటన



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క కులకచర్ల మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం కులకచర్లలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌లు విలేకరులతో మాట్లాడారు. నూతనంగా నియామకమైన మార్కెట్ కమిటీ, పాంబండ దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులతో పాటు దేవాలయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు మైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



గుండాలలో నిర్మించిన గోడను జేసీబీ సాయంతో కూల్చివేయిస్తున్న అధికారులు

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాలలో గల సర్వేనెంబర్ 153లోని ప్రభుత్వ భూమి మొత్తం ఎకరా గుంట ఉంది. ఇందులో కొంత భూమిని పల్లె ప్రకృతివనం కొరకు కేటాయించారు. మిగిలిన ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న మరో సర్వే నెంబర్ 154లో ఉన్న పట్టాదారుడు దాన్ శ్రీనివాస్ కుమార్ రాజా అనే వ్యక్తి ప్రభుత్వ భూమిలోని 15 గుంటల భూమిని ఆక్రమించాడు. ఇటీవల సర్వే చేయగా ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మంగళవారం తహసీలార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో కలిసి భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా.. భూమి చుట్టూ ప్రహరీ నిర్మించడంతో జేసీబీ సాయంతో కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా భూములు ఆక్రమణకు గురైతే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చూచిరాత పోటీలు

జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



విద్యార్థులకు పరీక్షా పత్రాలు అందిస్తున్న సభ్యులు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చూచిరాత పోటీలు నిర్వహించారు. జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన 500 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు జూలూరి రవీంద్రానంద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి సత్యం, ఫౌండర్ రంగారావు, జీహెచ్‌ఎం రామనాథంలతో కలిసి ఎంఈవో పాండు పోటీలను ప్రారంభించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు తరగతులవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు బికుమాండ్ల నర్సింహ, డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్, యాదగిరి, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఎంతో మేలు



వినతిపత్రం ఇస్తున్న ఆనంద్ మాదిగ

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో ఎంతో మేలు జరుగుతుందని, మాదిగ, మాదిగ ఉప కులాలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రతిఫలాలు అందినప్పుడే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు అవకాశం ఏర్పడుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ అన్నారు. ఈమేరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌కు ఆయన మంగళవారం మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, నాయకులు ప్రకాష్, సుభాష్, మహేందర్, నర్సిములు, జగదీష్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతి

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను మంగళవారం కలిసి మాలల స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు మాలమహానాడు సంఘం నాయకులు తెలిపారు. నవాబుపేట మండల మాల మహానాడు సంఘం నాయకులు ఆనందం, శివరాజ్, రత్నం, శ్యామ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రవీందర్, చంద్రశేఖర్, కృష్ణ, శిలింగం, సుధాకర్, నర్సిములు, ఎక్‌మామిడి మాజీ సర్పంచ్ దేవయ్య తదితరులు ఉన్నారు.





కాకరకాయల సాగు ఇలా.. ఇన్‌సెట్లో విరివిగా కాసిన కాయలు

కూరగాయలు @ బాబాగూడ

- పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
- తీగజాతి కూరగాయలతో పాటు ఇతర పంటల సాగు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : బాబాగూడ.. ఈ పేరు వింటేనే కూరగాయల పంటలు గుర్తుకు వస్తాయి. కూరగాయలు పండించడంలో అంతగా ప్రఖ్యాతిగాంచింది శామీర్‌పేట గ్రామానికి అనుబంధ గ్రామమైన బాబాగూడ. శామీర్‌పేట రాజీవ్ రహదారికి అతి చేరువలో ఉన్న బాబాగూడ గ్రామ రైతులు కూరగాయలు పండించడంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నగరంలోని పలు మార్కెట్లలో బాబాగూడ కూరగాయలంటే వేరే ఏం ఆలోచించకుండా దించేసుకుంటారు. ముఖ్యంగా తీగజాతి, ఇతర కూరగాయల పంటల సాగులో బాబాగూడ రైతులు ఇతరులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. శామీర్‌పేట మండల పరిధిలో బాబాగూడ ఓ చిన్న గ్రామం. దాదాపు 180 మంది రైతులుండగా.. వీరిలో 150 మందికి సొంత పట్టా కలిగిన భూములున్నాయి. ఒక్కో రైతుకు మూడు నుంచి పదెకరాల మేర భూములున్నాయి. 150 మంది రైతుల్లో 120 మంది యువరైతులే కావడం గమనార్హం. గ్రామంలో కాకర, సోర, బీర, దొండ, పొట్ల వంటి తీగజాతి పందిరి కూరగాయలను పండించడంలో ప్రసిద్ధిగాంచారు. ఏడాది పొడవునా రైతులు తీగజాతి కూరగాయలను పండిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ సంవత్సరం బాబాగూడ పరిధిలో ప్రస్తుతం 300 ఎకరాల విస్తీర్ణంలో 130 మంది రైతులు కాకరగాయలను పందిరి వేసిపండిస్తూ లాభాలను గడిస్తూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా, 30 మంది వరకు రైతులు ఇతర కూరగాయలైన బీర, పొట్ల, బెండ, టమాటాలను పండిస్తూ లాభాలను గడిస్తున్నారు. బాబాగూడ ప్రాంతానికి వ్యవసాయ సాగుకు సరిపడా నీటి వనరులు లేకున్నప్పటికీ బోరు బావులతో కూరగాయల పండిస్తున్నారు. అప్పుడప్పుడూ నష్టాలను చవిచూస్తున్నప్పటికీ సాగుపై మక్కువ తగ్గడం లేదు. అప్పులు ఎక్కువై ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు వీరు విరుద్ధం. యువ రైతులు డిగ్రీ వరకు చదువుకున్నప్పటికీ వ్యవసాయంపైనే మక్కువతో కూరగాయలు పండిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బాబాగూడ గ్రామానికి చేరుకోగానే రోడ్డుకిరువైపులా ఎక్కడ చూసినా కూరగాయల పందిర్లే కనిపిస్తుంటాయి. ఈ గ్రామ రైతులు ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు కూరగాయల తోటల్లోనే గడుపుతుంటారు. కోసిన పంటను రైతులే స్వయంగా తెల్లవారుజామున మెదక్ జిల్లాలోని ఒంటిమామిడి, నగరంలోని బోయిన్‌పల్లి, అల్వాల్ తదితర మార్కెట్లకు సరఫరా చేస్తారు. ఈ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉత్తమ రైతు అవార్డులను కూడా అందుకున్నారు. యువకులు, విద్యార్థులు కూడా ఖాళీ సమయాల్లో తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటూ కూరగాయల తోటల్లోనే పనిచేస్తుంటారు. గ్రామంలో ఎక్కడ చూసినా పచ్చని వాతావరణమే కనిపిస్తుంది. ఉన్న కొద్దిపాటి భూమిలో రెండు, మూడు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తూ సంవత్సరం పొడవునా పని ఉండేలా సీజన్‌ను బట్టి కూరగాయలను పండిస్తుంటారు. పది ఎకరాలకు పైబడిన వారు ఆధునిక పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలోనే పెద్ద బావులను తవ్వించి డ్రిప్ సిస్టమ్ ద్వారా నీటితో పాటు పంటకు ఎరువులను కూడా అందిస్తున్నారు. కరివేపాకు తోటలు కూడా ఎక్కువ మొత్తంలో పండిస్తున్నారు.



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాకరకాయలు

నీటి సంపుల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలి



పంటలకు నీరు పెట్టేందుకు రైతులు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న నీటి సంపులకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. నీటి సంపు నిర్మాణానికి రూ.2లక్షల 80వేల ఖర్చు అవుతుంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తే రైతులకు భారం తగ్గుతుంది. తోటల్లో కూలీల క్వార్టర్స్ ఏర్పాటుకు, నీటి సంపునకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి. నగరం దగ్గరగా ఉండటంతో కూరగాయాలు ఎక్కువగా తరలిస్తుంటాం.

- కందాడి పద్మారెడ్డి, రైతు, బాబాగూడ

కూలీల కొరత ఉంది



కూరగాయ తోటల్లో పనిచేసేందుకు నిత్యం కూలీలు అవసరమవుతారు. ప్రస్తుతం వారి కొరత ఉంది. దాంతో కూరగాయల సాగును కూడా తగ్గించాం. రైతులు కూడా మునుపటిలా పనులు చేయలేకపోతున్నారు. గత 25 ఏళ్ల నుంచి కూరగాయ పంటలనే సాగు చేస్తున్నాం. ఖర్చు కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. లాభాలు ఎక్కువగా ఉండటం లేదు. ఒక్కోసారి కూరగాయలు పడేయాల్సి వస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి.

- కందాడి సురేందర్‌రెడ్డి, రైతు

నర్సింగ్ కళాశాల వద్ద యువకుడి హల్‌చల్

- మద్యం సేవించి కాలేజీ లోపలికి ప్రవేశం
- భయాందోళనకు గురైన విద్యార్థినులు



తాండూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని ప్రభుత్వ ఏఆర్టీ సెంటర్‌పైన కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల వద్ద మద్యం సేవించిన ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. దాంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో గుర్తుతెలియని యువకుడు పూటుగా మద్యం సేవించి నేరుగా పైఅంతస్తులో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల వద్దకు వెళ్లాడు. అంతకుముందు కాలేజీ గేటు తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లాడు. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ విజయరాణి పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

వికారాబాద్‌లో రేపు జాబ్‌మేళా

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జొమాటో సంస్థలో ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో రేపు(గురువారం) ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జొమాటోలో సుమారు 50 డెలివరీ భాగస్వామి పోస్టులున్నాయని, 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగానికి స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి. విద్యార్హత అవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలు హైదరాబాద్‌లో ఉంటాయని తెలిపారు. వివరాలకు నిర్వాహకుడు మియాసాబ్ సెల్‌నెంబర్ 96760-47444 సంప్రదించాలన్నారు.

మహిళల్లో చైతన్యం తెచ్చింది టీడీపీయే



బక్కని ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దేవనూరు, గోరేపల్లివాసులు

యాలాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల్లో చైతన్యం తెచ్చి, మహిళా సంఘాలుగా ఏర్పాటు చేసింది టీడీపీయేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ మాజీ టీడీపీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. మంగళవారం దేవనూరు మాజీ ఎంపీటీసీ కోస్గి వెంకటయ్యగౌడ్ తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే బక్కని ఆధ్వర్యంలో యాలాలలో టీడీపీలోచేరారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ మహిళల్లో చైతన్యం తెచ్చి వారిని అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా చేశారని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలంగాణలో మహిళలతో పాటు అన్నివర్గాలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెస్తామన్నారు. దేవనూరు గ్రామానికి చెందిన వెంకటయ్యగౌడ్ టీడీపీలో చేరడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ గౌడ్, రాఘవులు, జావిద్, కాశప్ప, వెంకటయ్యగౌడ్, దేవనూరు, గోరేపల్లి వాసులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావంతో తెలుగు జాతికి గుర్తింపు

కడ్తాల్ : సభ్యత్వ నమోదులో టీడీపీ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆదర్శంగా నిలుస్తుందని టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు, సీనియర్ న్యాయవాది అండేకార్ యాది లాల్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రారంభించారు. డిజిటల్ సభ్యత్వాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ప్రేమ్ రాజ్ కు అందజేశారు. నాయకులు ప్రేమ్‌రాజ్, శివయ్య, కాలె శివ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంచాల : బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణి అన్నారు. మంచాల మండలం చీదేడ్‌లో టీడీపీ సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర నేతలు వంగాల కృష్ణ, కె.వెంకట్‌రెడ్డి, మోర యాదయ్య, మంగళారం శంకర్, ఏ.మల్లారెడ్డి, బుస్సు శంకర్, పాల్గొన్నారు.



వికారాబాద్: మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది డీబీ శీతల్



చౌదరిగూడ: డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది డీబీ శీతల్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ భృంగీ ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శీతల్ పాల్గొని మాట్లాడుతూ బాల్యవివాహాల ప్రభావం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అవసరమని అన్నారు. చిన్నప్పుడే వివాహాలు చేయడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో భృంగీ విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. వెంకటేశ్, డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి, కొడంగల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, డైరెక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకుందాం

చౌదరిగూడ: మానవ హక్కులను కాపాడుకుందామని తెలంగాణ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ అనుబంధ కార్మికులచే ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో హక్కులను కల్పించిందని.. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీతహసీల్దార్ భాస్కర్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, అశోక్, మంగమ్మ, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవికుమార్

మహిళలు ఆర్థికంగా రాణించాలి

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా రాణించాలని మెప్మా పీడీ రవికుమార్, పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యలు కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని అంబేడ్కర్ భవన్‌లో మహిళా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల్లోని సభ్యులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తీసుకున్న రుణాలను గడువులోపు చెల్లిస్తే. రెట్టింపు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎంసీ వెంకటేశ్, సీఈవో భాగ్యలక్ష్మి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

చౌదరిగూడ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఉమ్మడి టీఎస్‌యూటీఎఫ్ కొందుర్గు మండల మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ నియమాకాలు, ఉద్యోగ బదిలీలు, ప్రమోషన్ల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాఠశాల, ఉన్నత విద్యారంగం కాస్త మెరుగుపడిందన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీలు

టీఎస్‌యూటీఎఫ్ ఉమ్మడి కొందుర్గు మండల నూతన కమిటీలను ఉపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు మండలాధ్యక్షుడిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హతిరామ్, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షురాలిగా నీలా మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, రాజయ్య, తేజస్విని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు సంఘటితం కావాలి



షాబాద్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కురుమలు సంఘటితం కావాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపోల్ నర్సింహులు అన్నారు. ఈ నెల 14న కోకాపేటలో నూతనంగా నిర్మించిన కురుమ సంఘం భవనం ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో కురుమలు తరలిరావాలని కోరారు. ఈమేరకు మంగళవారం షాబాద్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య, మండలాధ్యక్షుడు మద్దూరి పాండు, ఉపాధ్యక్షుడు నారాయణ, నాయకులు తదితరులున్నారు.

మేడ్చల్ టౌన్: దొడ్డి కొమురయ్య పేరిట ఈ నెల 14న ప్రారంభిస్తున్న కురుమల ఆత్మ గౌరవ భవనం ప్రారంభోత్సవానికి కురుమ సంఘం నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కురుమసంఘం కార్యాలయంలో కురమ భవన ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలి

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అంతారం గ్రామస్తులతో మాట్లాడారు. అక్టోబరు 21న గ్రామంలో రెండు వర్గాలు గొడవపడటంతో పలువురు గాయపడిన సంఘటన విదితమే. ఈ నేపథ్యంలో రెండు వర్గాల ప్రజలతో సీఐ మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్షణ లేక ప్రమాదకరంగా..


హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ కాలనీలో ఏఈఈ కార్యాలయం వద్ద ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు ట్రాక్స్‌కో ఫెన్సింగ్‌లు, రక్షణ గోడలు ఏర్పాటు చేయక ప్రజల పాలిట ప్ర మాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు జంకుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో నివాసాలకు దగ్గరగా, అలాగే పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ గానీ రక్షణ గోడలు గానీ నిర్మించలేదు. హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ కాలనీ కమాన్ వద్ద ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడ గానీ ఫెన్సింగ్ కానీ లే వు. ఇది తక్కువ ఎత్తులో ఉంది. ఎన్టీఆర్ పాఠశాలకు వెళ్లే రోడ్డు పక్కనే ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. నిత్యం ఈ రోడ్డు నుంచే విద్యార్థులు వెళ్తుంటారు. గ్రామాల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్‌లు వేయలేదు. పశువులు మేసుకుంటూ వాటి వద్దకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృత్యువాత పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫా ర్మార్లకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ఇదిలా ఉంటే హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ కమాన్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే చిలుకూరు ఏఈఈ కార్యాలయం ఉన్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న శాంతిశ్రీ

కందుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతిశ్రీ అన్నారు. మంగళవారం అగర్‌మియాగూడ అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. శిశువుకు తల్లులు ముర్రుపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాచులూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్లు వినోద్‌కుమార్, గర్భిణులు, బాలంతలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో మార్పు, ఉన్నత జీవితం సాధ్యమని క్లాస్‌మేట్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు తోడ్పడాలని కోరారు. ఆమనగల్లు బాలుర పాఠశాలలో మంగళవారం ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం పాండు, టీచర్లు అశోక్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి వెంకటేశ్ విరాళం

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తిలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.51లక్షల విరాళం ప్రకటించి మొదటి విడత రూ.50వేలు ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉప్పల వెంకటేశ్ కార్యాలయంలో ట్రస్ట్ సభ్యులు ఆలయ నిర్వాహకులకు చెక్కు అందజేశారు. వెంకటేశ్‌ను ఆలయ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో జ్యోతయ్య, గణేశ్, హన్మ, నర్సింహ, సత్యం, శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న నాయకుడు

క్రైం కార్నర్

స్కూల్ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం


మృతుడు ఇమ్రాన్(ఫైల్)

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తతో డ్రైవర్ స్కూల్ బస్సును నడిని ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం మండల పరిధి ఎన్కెపల్లి గేట్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని శ్రీ సత్యసాయి గ్రామర్ హైస్కూల్ బస్సు మంగళవారం ఉదయం ఎన్కెపల్లి పరిధిలోని పిల్లలను ఎక్కించుకుని చేవెళ్లకు వస్తోంది. కాగా మొండివాగుకు చెందిన ఇమ్రాన్(22) సెంట్రింగ్ పని చేసేవాడు. పని కోసం బైక్‌పై ఎన్కెపల్లి వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన స్కూల్ బస్సు ఇమ్రాన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇమ్రాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమయంలో రోడ్డు కన్పించనంతగా పొగమంచు ఉంది. బస్సు డ్రైవర్ వేగం కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఇమ్రాన్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇమ్రాన్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు స్కూల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్-బస్సు ఢీ.. వ్యక్తి మృతి

మంచాల, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆగాపల్లి సాగర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మంచాల సీఐ మధు తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా సరికొండకు చెందిన కొమ్ము ప్రశాంత్(24) సోమవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా ఆగాపల్లి బస్టాండు వద్ద టిప్పర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రశాంత్‌ను పోలీసు వాహనంలోనే ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


విజయ్‌కుమార్ మృతదేహం

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ధర్మసాగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల ధర్మసాగర్‌కు చెందిన కమ్మరి విజయ్‌కుమార్(33) చేవెళ్లలో టైలర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భర్య సుమలతతో గొడవలు జరుగుతున్నాయి. గతంలోనూ చేవెళ్లలో పోలీస్ స్టేషన్, ఎయిర్‌టెల్ టవర్లు ఎక్కి చనిపోతానని బెదిరించాడు. మంగళవారం మరోసారి గొడవ జరుగగా చెట్టుకు ఉరేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు చేరుకొని డెడ్‌బాడీని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. విజయ్‌కుమార్ తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


సాయికుమార్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లొస్తానని వెళ్లిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాలేదని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తిమ్మాయపల్లికి చెందిన సాయికుమార్ తన భార్య భార్గవితో కలిసి నగరంలోని బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఉంటున్నారు. భార్య కూలి పనులకు వెళ్తుండగా సాయికుమార్ మెకానిక్ పనిచేస్తున్నాడు. ఈ నెల 6న పరిగి మండలం కాళ్లాపూర్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. మరుసటి రోజు బస్సులో భార్యాభర్తలు షాద్‌నగర్ వచ్చారు. భార్యను హైదరాబాద్ బస్సు ఎక్కించి షాద్‌నగర్‌లో ఉన్న మరో బంధువు చిన్నయ్యగారి వెంకటేష్‌ను కలిసొస్తానని చెప్పాడు. మరుసటి రోజు కూడా సాయికుమార్ ఇంటికి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

'సీపీఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలి'

కొత్తూర్, డిసెంబరు 10:(ఆంధ్రజ్యోతి) భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఇన్ముల్‌నర్వలో మంగళవారం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమానికి జంగయ్య హాజరై మాట్లాడారు. 2025లో సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనుందన్నారు. సీపీఐ ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారంలో ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు, నాయకులు ఎండీ షకీల్, అజ్మత్, మైసయ్య, నర్సింహ్మా, మహమ్మద్‌హుస్సేన్, దేవమ్మ, రెహమత్ తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

శంకర్‌పల్లి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): సంకేపల్లి సగర సంఘం అధ్యక్షుడిగా సందోళ్ల శ్రీనివాస్ ఏకగ్రీంగా ఎంపికయ్యారు. గ్రామంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు మర్క సతీష్ సమక్షంలో సగర సంఘం నూతన కమిటీని ఏకగ్రీమంగా ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా మోహన్, కోశాధికారి రవీందర్, ఉపాధ్యక్షులు సతీష్, వెంకటేష్, సంయుక్తకార్యదర్శులు మల్లేషం, ఉప్పరిదాస్, కార్య నిర్వాహక కార్యదర్శి నర్సింలు, నగేష్, ప్రచార కార్యదర్శులుగా నాగరాజు, రాజేందర్ ఎంపికయ్యారు. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు నూతన కమిటీని అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


కొత్తూర్‌లో సీఎం కప్ పోటీలను ప్రారంభింస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, దేశ స్థాయి పోటీలకు ఎదుగాలన్నారు. మూడు రోజులు నిర్వహించే క్రీడల్లో ప్రావీణ్యం చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు కోస్లి శ్రీనివాస్, హేమదేవేందర్ ముదిరాజ్, చంద్రకళరాజేందర్, జయమ్మ జనార్ధన్‌చారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, సత్తయ్య, నర్సింహ పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్: గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అజీజ్‌నగర్ జెడ్పీ పాఠశాల మైదానంలో మొయినాబాద్ సీఎం కప్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభి ంచి మాట్లాడారు. ఎంపీడీఓ సంధ్యరాణి, తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఎం ఈవో వెంకటయ్య, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, అజీజ్‌నగర్ పీఏస్ జమీల్, కాంగ్రెస్ నాయకులు దర్శన్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, పీఈటీలు అనితారాణి, సుమ, నీరజ, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారం: విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలని యాచారం స్పెషలాఫీసర్ సంధ్యారాణి అన్నారు. యాచారంలో సీఎంకప్ ఆటలను ప్రారంభించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్, భాస్కర్, యా దమ్మ, శివ, పీఈటీలు మల్లయ్య, జ్యోతి. రాణి, కృష్ణ పాల్గొన్నారు

కేశంపేట: క్రీడాకారులు తమ నైపుణ్యాన్నిప్రదర్శించేందుకు సీఎం క్రీడలు మంచి అవకాశమని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. కేశంపేట జెడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో తహసీల్దార్ ఆజం అలీ, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నరహరిలతో కలిసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం వీరారెడ్డి, పీడీ ఆనంద్ బాబు, డాక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని మంచాల ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి అన్నారు. సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ఎం.సుజాత, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, సీఐ మధు, ఎంఈవో రాందాస్, నాయకులు వెంకటేష్‌యాదవ్, జిలమోని సత్తయ్య, వివిధ గ్రామాలక్రీడాకారులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీన్‌కుమార్ అన్నారు. శంకర్‌పల్లిలోని బాలుర పాఠశాల ప్రాంగణంలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. క్రీడలతో శారీరక దారడ్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంఈవో అక్బర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పోటీల ప్రారంభానికి ముందు క్రీడాకారులతో ఎమ్మెల్యే యాదయ్య

తెలంగాణ తల్లి విగ్రహం మార్పు సరికాదు


ఇబ్రహీంపట్నంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విగ్రహాలకు, చిత్రపటాలకు పాలాభిషేకాలు

ఇబ్రహీంపట్నం/షాద్‌నగర్/కేశంపేట/చౌదరిగూడ/చేవెళ్ల/మొయినాబాద్/కొత్తూర్/కందుకూరు/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/శంకర్‌పల్లి/మాడ్గుల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహ మార్పును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పలుచోట్ల పాత తెలంగాణ తల్లి విగ్రహాలకు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఇక్కడ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు యాదగిరి, సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, జెర్కోని రాజు, పి.రాజ్‌కుమార్, సురేష్, రవీందర్, ప్రవీణ్‌కుమార్, అరవింద్, ముత్యాల వినోద్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్నే ప్రజలు కోరుకుంటున్నారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం చేశారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన విగ్రహాలు, సంప్రదాయాలు మారవు అన్నారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకులలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గోస్కి నర్సింలు, యాదయ్య, పి.రామ్ రెడ్డి, అంజనేయులు, యాదగిరి, మల్లేష్, పాండు, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొందర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు పాత తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొందర్గు, జిల్లేడ్ చౌదరిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు హఫీజ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. బంగారు రాములు, వెంకటేష్, రాంచంద్రయ్య, బాబురావు, జబ్బార్, అక్రం, ఇస్మాయిల్, అజ్మీరి పాల్గొన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ ఆధ్వర్యంలో చేవెళ్లలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, బి.నర్సింలు, సత్యనారాయణ చారి, ఎల్లయ్య, కృష్ణ, విఘ్నేష్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు. మొయినాబాద్‌లో మాజీ జడ్పీటీసీ కొం పల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాభిషేకం చేశారు. నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవూఫ్, జగన్మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, పరమేశ్, భాస్కర్, అరవింద్, ఫరీద్, షరీఫ్ పాల్గొన్నారు. కొత్తూర్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వై జంక్షన్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈటె గణేష్, బి.దేవేందర్ యాదవ్, డోలి రవీందర్, కోస్లి శ్రీనివాస్, సోమ్లనాయక్, విఠల్, రాజేందర్‌గౌడ్, యాదయ్య, మధుసూదన్‌రావు, రవినాయక్, లక్ష్మణ్, గోపాల్ పాల్గొన్నారు. కందుకూరులో మహేశ్వరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కాసుల రామకృష్ణారెడ్డి, పొట్టి ఆనంద్, దామోదర్‌గౌడ్, ప్రకాశ్ రెడ్డి, వెంకటేష్, లక్ష్మణాచారి, సామయ్య పాల్గొన్నారు. ఆమనగల్లులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో మండల పరిషత్‌కు చేరుకొని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు నిరంజన్‌గౌడ్, గుత్తి బాలస్వామి, రఘు, సురేందర్‌రెడ్డి, శ్రీను, వెంకటేశ్, యాదయ్య, జగన్, గణేశ్, రమేశ్, మహేశ్, భాస్కర్, ఆనంద్, విక్రమ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్కసుతోనే తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చిందని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. కడ్తాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కడారి రామకృష్ణ, బొప్పిడి గోపాల్, నర్సింహ, లాయక్ అలీ, వెంకటేశ్, లక్ష్మణాచారి, అంజి, మహేశ్, వెంకటేశ్‌పాండు, జగన్, బిక్క పాల్గొన్నారు. తలకొండపల్లిలో బీఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శేఖర్, స్వామిగౌడ్, మల్లేశ్, చంద్రయ్య, శంకర్, పాండు, మహేశ్ పాల్గొన్నారు. శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిశేకం చేశారు. నాయకులు రాజు, లింగం, నరసింహరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఫరీద్, యాదగిరి, విజయ్, భాస్కర్, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు. మాడ్గులలో బీఆర్ఎస్ తెలుగు తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ జైపాల్, లాలయ్యగౌడ్, పల్లేటి యాదయ్య, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కొత్తూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న అంజయ్య

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): షాబాద్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలల 2008-09 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మంగళవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనాన్ని నిర్వహించారు. స్కూల్ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహబంధం మరిచిపోనిదన్నారు. ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్క చోటికి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాటి టీచర్లు సుశీల, సునీత, అంజనేయులు పూర్వవిద్యార్థులు మంజుల, శమంత, సమీనా, సుందరి, స్వాతీబాయ్, మౌనిక, అనిత, రూబీనా, రజియా, అమరమాల, రమాదేవి, శారద, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతోనే మేధస్సు పెంపొందుతుంది

షాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలతోనే విద్యార్థుల మేధస్సు పెంపొందుతుందని ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాబాద్‌లోని బాలుర పాఠశాలలో మంగళవారం వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చేసిన వివిధ సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మనిషి దూసుకుపోవడానికి కారణం సాధించిన విజ్ఞానమేనన్నారు. మానవ బుద్ధి వికాసానికి సైన్స్ దోహదం చేస్తోందన్నారు. విద్యార్థులు విజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న అధికారులు

వీరేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి షాద్‌నగర్ ప్రాంతానికి లయన్స్ క్లబ్ సేవలను పరిచయం చేసి, పేదలకు ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహించారని క్లబ్ సభ్యులు అన్నారు. క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ టౌన్ అధ్యక్షుడు లయన్ కమ్మదనం సందీప్ ఆధ్వర్యంలో మంగళవారం లయన్ వీరేందర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. లయన్ శాంతిలాల్ పటేల్, చందులాల్ రాథోడ్, అశ్విన్ పటేల్, శివనాగయ్య, బాలబ్రహ్మాచారి పాల్గొన్నారు.

కొలువులేవీ?

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 170కి పైగా పరిశ్రమలు వచ్చాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో 60, కొందుర్గు, చౌదరిగూడ మండలాల పరిధిలో మరో 15 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పీసీబీ లెక్కల ప్రకారం వాటిలో 35వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్మికుల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, తరచూ ప్రమాదాలు జరగడం, కార్మికులు మృత్యువాత పడటం సర్వసాధారణమయ్యాయి. ఇటీవల ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలోని ఒక పరిశ్రమలో పేలుడు సంభవించి ఐదుగురు కార్మికులు మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.

ఏదీ స్థానికత: నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు జరిగినప్పటి నుంచి స్థానికులకు ఉద్యోగాలివ్వాలన్న డిమాండ్ ఉంది. పరిశ్రమ యాజమాన్యాలు మాత్రం స్థానికులకు ఉద్యోగాలివ్వకుండా బిహార్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల కార్మికులను దిగుమతి చేసుకుంటున్నారు. వారితో రోజుకు 12నుంచి 14గంటల వరకు పనిచేయించుకుంటున్నారు.కార్మికులకు కనీస వేతనాలూ ఇవ్వడం లేదు. స్థానికులైతే రూల్స్ మాట్లాడుతారని, మాట వినరనే ఉద్యోగాలు ఇవ్వడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఉద్యోగాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్తున్నారు. స్థానికులకే ఉద్యోగాలు ఇస్తామని అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మొదలుకుని, కేసీఆర్ వరకు హామీ ఇచ్చారు. స్థానికులకే ఉద్యోగాలివ్వాలనే జీవో తెస్తామని చెప్పారు. కానీ ప్రభుత్వం మారడంతో ఆ జీవో సంగతి అటకెక్కింది.

పచ్చటి పొలాలపై కాలుష్యపు కాటు: స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను వేధిస్తున్న యాజమాన్యాలు పరిశ్రమల కాలుష్యంతో రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. కాలుష్య నియంత్రణ బోర్డు నిబంధనలను పాటించడం లేదు. ఐరన్, రసాయన పరిశ్రమల కాలుష్యంతో పొలాలు నాశనమవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం పరిశ్రమలను నాలుగు విభాగాలుగా విభజించి వైట్, గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ జోన్‌లుగా ఏర్పాటు చేసింది. వైట్, గ్రీన్ పరిశ్రమలను కాలుష్య రహితంగా, ఆరెంజ్, ఎల్లో పరిశ్రమలను కాలుష్య పరిశ్రమలుగా గుర్తించింది. ఈ ఆరెంజ్, ఎల్లో పరిశ్రమలు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతీ పరిశ్రమలో ఈఎస్‌పీ(ఎలక్ట్రోస్టేటిక్ ప్రిసిపిరేటర్) పరికరాలను విధిగా అమర్చుకోవాలన్న నిబంధన విధించింది. పరిశ్రమలు వెదజల్లే పొగను శుద్ధి చేసి గాల్లోకి వదలడానికి ఈ పరికరం పనిచేస్తుంది. అయితే వీటిని ఉపయోగిస్తే తమపై అదనంగా విద్యుత్ భారం పడుతుందని ఈఎస్‌పీని వినియోగించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈఎస్‌పీ సిస్టాన్ని కేవలం రెండుమూడు కంపెనీలు మాత్రమే వినియోగిస్తున్నట్లు సమాచారం. రసాయన పరిశ్రమల ద్వారా వచ్చే నీటి కాలుష్యాన్ని నియత్రించేందుకు పరిశ్రమల్లో ఈటీపీ(ఇఫ్ల్యుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను అమర్చుకోవాలి. దీని ద్వారా రసాయన పరిశ్రమలో నుంచి వచ్చే కాలుష్య నీటిని శుద్ధిచేసిన తర్వాతే బయటకు వదలాలి. ఈ పద్ధతిని కొన్ని పరిశ్రమలే పాటిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల సూచనల మేరకు వీటిని పరిశ్రమల్లో బిగిస్తున్నా విద్యుత్ భారంతో వినియోగించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలి



పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కానీ, పాలకులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం కూడా స్థానికులకు ఉద్యోగాలిచ్చి నిరుద్యోగ సమస్యను తీరుస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. కనీసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక జీవో తీసుకు రావాల్సిన అవసరం ఉంది.

- పినపాక ప్రభాకర్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్

మల్కాపూర్‌లో ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్‌లో గురుస్వామి వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం పడిపూజ నిర్వహించారు. స్వాములు అరుణ్, ఉమాశంకర్‌రెడ్డి, కృష్ణన్‌ల సమక్షంలో పూజ నిర్వహించారు. జంగిరెడ్డి, నర్సింగ్‌రావుల భజమండిలి ఆలపించిన భక్తి పాటలు అలరించాయి. పూజ అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయలక్ష్మీశర్వలింగం, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, యాదిరెడ్డి, ఆగిరెడ్డి పాల్గొన్నారు.

'బిల్లులివ్వకుండా ఇబ్బందిపెట్టిన బీఆర్ఎస్'

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేసిన పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండ ఇబ్బంది పెట్టిందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వస్పుల శ్రీశైలం అన్నారు. పెం డింగ్ బిల్లుల గూర్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఆమనగల్లులో మంగళవారం మాట్లాడారు. గత ప్రభుత్వం పంచాయతీల నిధులను పక్కదారి మళ్లించి బిల్లులివ్వలేదని అన్నారు.

'కాంగ్రెస్‌కు యూత్ విభాగం కీలకం'

ఆమనగల్లు,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన వస్పుల శ్రీకాంత్ మంగళవారం శివసేనారెడ్డిని హై దరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను శివసేనారెడ్డి అభినందించారు. పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అంకిత భావంతో పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాదిలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించిందని తెలిపారు.

సంక్షిప్తంగా

- **మహేశ్వరం:** ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని ఫౌండేషన్ అధినేత మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరంలోని శివగంగరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. యేటా 40 రోజుల పాటు కఠోర దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములను స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు.
- **యాచారం:** డాక్టర్ అంబేడ్కర్ ఆశయసాధనకు యువత కృషిచేయాలని సంఘ నాయకులు చిన్నోళ్ల జహంగీర్, యాదయ్య అన్నారు. మాల్‌లో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగం రచించకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులకు భంగం కలిగేదని వారు అన్నారు.

షాద్‌నగర్ రూరల్: ఈ నెల 19 నుంచి కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో జరిగే సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని మల్టీ జోనల్ ఆఫీసర్ రజిని అన్నారు. గురుకుల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, ప్రిన్సిపాల్స్, ఇతర విభాగాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల నుంచి 12 వందల మంది బాలికలు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

- **కడ్తాల్:** గడ్డమీది తండాకు చెందిన సభావట్ రూప్లీ మృతిచెందింది. ఆమె మృతదేహానికి గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు జవహర్‌లాల్ నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. తులసీరామ్‌నాయక్, రవికుమార్, పాప, చందు, నందు ఉన్నారు.
- **కడ్తాల్:** మానసిక వికాసం, శారీరక ధారుడ్యానికి క్రీడలు దోహదపడుతాయని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాలలోని బాలుర పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్‌లతో కలిసి వారు ప్రారంభించారు. మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు, యువతి, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండు రోజులు నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబరిచే వారిని మండల టీంలను ఎంపిక చేస్తామని ఎంఈవో తెలిపారు.
- **మొయినాబాద్:** హెల్త్ డైరెక్టరేట్ కార్యాలయ ముట్టడించకుండా ఆశా వర్కర్లను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నయకులు పీఏస్‌లో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతరెడ్డి, కెనర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సురేందర్‌గౌడ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
- **కడ్తాల్:** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ చేయూతనందించారు. రాధాకృష్ణ ట్రస్ట్ ద్వారా తోడ్పాటునందించి పెద్ద మనస్సును చాటుకున్నారు. కడ్తాలలోని ఆరో వార్డుకు చెందిన కేశని బాలమ్మ-శివ దంపతుల కుమార్తె మాధవి వివాహం సందర్భంగా రూ.21వేల నగదు, పట్టుచీరను సమకూర్చారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి మాధవికి అందజేశారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు దశరథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.